అక్రమార్కులకు ఆదివరం

నిఘా



జడ్చర్ల: దుందుభి వాగులో ఫిల్టర్ ఇసుక తయారీ

- మట్టి, ఇసుక గుట్టుగా తరలింపు
- నిద్రావస్థలో జిల్లా యంత్రాంగం

ఈనాడు, మహబూబ్‌నగర్: యంత్రాంగానికి సెలవు రోజైన ఆదివారం అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అందినకాడికి దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు.. ఇసుక, మట్టి వ్యాపారాలతో పాటు అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు సైతం తెగబడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అంతటా ఈ పరిస్థితే కనిపిస్తోంది.

ఇసుక, మట్టి..: జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి, ఇసుక దందాలకు ఆదివారం అడ్డే లేకుండా పోతోంది. ● అడ్డాకుల మండలం వర్ని పెద్దవాగు నుంచి ఇసుక తవ్వుతున్నారు. పలుగు గుట్ట నుంచి ఎర్ర మట్టి ఇష్టారీతిన తరలిస్తున్నారు. ● సీసీకుంట మండలం లాల్ కోట, నెల్లికొండి శివారు ఎర్రగుట్ట, మద్దూరు, బండ్రవల్లి ప్రాంతాల్లోని ఊకచెట్టు వాగులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ● కౌకుంట్ల మండలం రేకులంపల్లి శివారు పెద్దవాగు నుంచి టిప్పర్లలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ● భూత్పూర్ మండలం తాటికొండ, హస్నాపూర్, అమిస్తాపూర్, భూత్పూర్ గుట్టల నుంచి మట్టి తవ్వి ట్రాక్టర్లు, లారీల్లో నింపి నిర్మాణాలు, వెంచర్లకు తరలిస్తున్నారు. ● మిడ్జిల్ మండలం కొత్తపల్లి శివారులోని దుందుభి వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ● బాలానగర్ మండలం నందారం, మాచారం, జీడిగుట్ట తండా, గౌతాపూర్, అప్పాజిపల్లి, సూరారం గ్రామాల్లో మట్టి, మొరం, ఇసుక దందాకు అంతే లేకుండా పోతోంది. ● హన్వాడ మండలం ఆచార్యపూర్ మద్దెల వాగు, సూరారం వాగుల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతున్నారు. దర్జాగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ నిర్మాణాలు సైతం: భూముల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు, అనుమతుల్లేకుండా రోడ్డు పక్కన, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు ఇలాంటివి ఆదివారాల్లోనే చేస్తున్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్లలో అక్రమ నిర్మాణాలు రాత్రికిరాత్రే వెలుస్తున్నాయి. ఈ దందాలన్నింటిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

వారమంతా నిల్వ ఉంచి..: మట్టి, ఇసుకను అక్రమార్కులు తవ్వి వారమంతా కంప, చెట్ల పొదల్లో నిల్వ ఉంచి ఆదివారం, సెలవు దినాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.3-6 వేలు పలుకుతోంది. దూరాన్ని బట్టి టిప్పర్ రూ.25 - 40 వేలకు విక్రయిస్తున్నారు.

ఫిల్టర్ చేసి..

రాజాపూర్, రాయపల్లి చెన్నవెల్లి, ముదిరెడ్డిపల్లి సమీపంలోని దుందుభి వాగు శివారుల్లో మట్టిని కడిగి ఫిల్టర్ ఇసుక తయారు చేస్తూ పదుల సంఖ్యలో లారీల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ● జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతాల్లో, అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లి, దేవరకద్ర మండలం వెంకటాయపాలెం, కోయిలకొండ మండలం వెంకటాపూర్, భూత్పూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో దర్జాగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల తదితర పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక నేలలున్న పొలాలను ఇసుక మాఫియా కొని మరీ కృత్రిమంగా తయారు చేస్తున్నారు.

పది విద్యార్థుల అల్పాహారానికి నిధుల మంజూరు

పాలమూరు, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రత్యేక తరగతుల సందర్భంగా అల్పాహారం (స్నాక్స్) అందజేసేందుకు పాఠశాల విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. పరీక్షలకు ముందు 45 రోజులు వారికి అల్పాహారం అందిస్తారు. 2027 మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఈ సారి ముందస్తుగా నిధులు విడుదల అయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 26,772 మంది విద్యార్థులకు అల్పాహారం కోసం రూ.1,80,71,100 మంజూరు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 6,685 మంది విద్యార్థులకు రూ.45.12లక్షలు కేటాయించారు.




లేజర్‌షో రూమ్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఎమ్మెల్యే విజయుడు ● అలరించిన ప్రదర్శన

అహో.. లేజర్ షో

అలంపూర్, న్యూస్‌టుడే: ఐదో శక్తిపీఠం జోగులాంబ ఆలయాన్ని సందర్శించే భక్తులకు లేజర్ షో సరికొత్త అనుభూతిని పంచింది. ఆదివారం అలంపూర్ ఆలయాల వద్ద రూ.4.60 కోట్లతో చేపట్టిన మల్టీమీడియా, సౌండ్ లైట్స్, లేజర్ షోను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ప్రారంభించారు. యువత ఆధ్యాత్మికం వైపు దృష్టి పెట్టారని, ఎక్కడ చూసినా ఆలయాల్లో యువత సందడే కనిపిస్తోందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ఇప్పటికే చాలా నిర్లక్ష్యం జరిగిందని, రాబోయే రోజుల్లో అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు.

రోజూ రెండుసార్లు

లేజర్ షో రోజూ రాత్రి 7 గంటలకు తిరిగి 7.45 గంటలకు రెండుసార్లు 25 నిమిషాల చొప్పున ఉంటుందని అధికారులు తెలిపారు.

గోడ కట్టేస్తూ.. ఆట కట్టిస్తూ..



మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచి సాకర్ ఆటంటే అతనికి ఇష్టం. నిరంతర సాధనతో గురుకులంలో ఆ కల సాకారం చేసుకున్నాడు. ఫుట్‌బాల్ గోల్‌కీపర్‌గా ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా అడ్డుగోడలా నిలుస్తున్నాడు. వారి ఆట కట్టిస్తున్నాడు. ఇలా ఆడుతూ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాడు. అతనే ధన్వాడ మండలం మేకబండ తండాకు చెందిన **మేఘావత్ రోహిత్.** ప్రస్తుతం కొండాపూర్ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బెంగళూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జూనియర్స్ ఫుట్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

శిక్షకుడి ప్రోత్సాహంతో.. గురుకులంలో ఉంటూ చదువుకుంటున్న రోహిత్ మూడేళ్లుగా శిక్షకుడు కల్యాణ్ ప్రోత్సాహంతో ఫుట్‌బాల్‌లో ఆరితేరాడు. జట్టులో గోల్ కీపర్ స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. తల్లిదండ్రులు సైతం వెన్నుతట్టడంతో తిరుగులేకుండా ఇప్పటి వరకు నాలుగు రాష్ట్రస్థాయి టోర్నీలు, ఒక జాతీయ స్థాయి టోర్నీ ఆడి రెండో జాతీయ స్థాయి పోటీకి ఎంపికై ఆడుతున్నాడు. హైదరాబాద్‌లో సుబ్రతో ముఖర్జీ టోర్నీ, హకీంపేటలో సీఎం కప్ టోర్నీ, నల్గొండలో ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి టోర్నీ, హైదరాబాద్‌లో మరో రాష్ట్రస్థాయి పోటీలో, మేలో చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో సత్తా చాటాడు. భారత ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన ఆశయమని చెబుతున్నాడు రోహిత్.


ఆదిలోనే హంసపాదు.. ఆపై అడుగుపడదు



గత ప్రభుత్వంలో చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ఏళ్లు అవుతున్నా పూర్తి చేసేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదు. హన్వాడ మండలం బుద్దారంలో 40 ఇళ్లకు భూమిపూజ చేశారు. బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు చేసి వదిలేశారు. ఇప్పటికైనా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, హన్వాడ**

వెలగని దీపం.. ఎవరిదీ పాపం

బైపాస్‌లో టైమర్ ఏర్పాటుతో ఇక్కట్లు!




దీపాలు పనిచేయక వాహనాల వెలుగే దిక్కు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: బైపాస్ రహదారిపై విద్యుత్తు దీపాలకు టైమర్ ఏర్పాటుతో మధ్య రాత్రి దాటిన తర్వాత వెలగడం లేదు. దీంతో చీకటి అలుముకుంటోంది. ఎస్వీఎస్ ఆసుపత్రి సమీపం హనుమాన్ జంక్షన్ చౌరస్తా నుంచి ఎదిర రోడ్డు చౌరస్తా వరకు రోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచి విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. సాయంత్రం 6 గంటల నుంచి ఈ దీపాలు వెలగాల్సి ఉండగా.. రెండు మూడు చోట్ల 300 మీటర్లకుపైగా ఒక్క దీపం కూడా వెలగని పరిస్థితి నిత్యం కన్పిస్తోంది.

తెల్లవారుజాము 'నడక' యాతన: తెల్లవారుజాము నుంచే చాలా మంది ఈ మార్గంలో నడక సాగిస్తుంటారు. వాహనాలు కూడా ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు రహదారిపై కుక్కను ఢీకొని కిందపడటంతో గాయాలయ్యాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచి విద్యుత్ దీపాలు వెలగకుండా ఆటోమెటిక్ విధానాన్ని బిగించినట్లు సంబంధిత గుత్తేదారుపై ఆరోపణలున్నాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు వీధిదీపాలు వెలిగేలా చేయాలని ఆయా కాలనీల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిండా మొక్కలు.. నీరు రాక చిక్కులు



సాగునీటిని అందించే ఆర్డీఎస్ ఉప కాల్వలు అధ్వానంగా మారడంతో అరకొర నీరొచ్చినా అందని పరిస్థితి నెలకొంది. మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, పచ్చర్ల, తుమ్మిళ్ల, అశోక్‌నగర్, రాజోలి గ్రామాల్లో ఆర్డీఎస్ కాల్వ ప్రధాన డిస్ట్రిబ్యూటర్ల కింద వివిధ రకాల ఉప కాల్వలున్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి సాగునీటిపారుదలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే నీరు లేక పంటలకు గడ్డుకాలం ఉండగా, రానున్న రోజుల్లో నీరొచ్చినా గడ్డి, పిచ్చిమొక్కల కారణంగా అందే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, రాజోలి**

అసంపూర్తి పనులతో అవస్థలు



పుర పరిధిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టడానికి దాదాపుగా ఆరు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించారు. సంబంధిత గుత్తేదారుడు స్లాబ్ వేసి గోడల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఒకే గది ఉండటంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కందనూలు**

పట్టుబట్టు.. గోల్ కొట్టు



సెలవొస్తే చాలు జడ్చర్ల మినీ స్టేడియం కిటకిటలాడుతుంటుంది. వయసుతో సంబంధం లేకుండా వివిధ రకాల క్రీడలు సాధన చేస్తుంటారు. ఆదివారం పిల్లల నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఫుట్‌బాల్ ఆడటం ఆకట్టుకుంది. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం సాధన చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నామని వారు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం**

దంత వైద్యం.. సేవలకు దూరం



మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడేళ్ల కిందట రూ.5 లక్షలు వెచ్చించి దంత చికిత్స యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రెండేళ్లు వైద్య సేవలు అందించారు. గతంలో పని చేసిన దంత వైద్యుడు బదిలీపై వెళ్లడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెడితే.. వైద్యసేవలు మళ్లీ ప్రారంభం అవుతాయనడంలో సందేహం లేదు. **- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం**

ఆర్టీసీ వైపే మహిళల చూపు



నాగర్‌కర్నూల్: ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న మహిళలు

కందనూలు, కల్వకుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లడానికి ఆలస్యమైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయాణ ప్రాంగణానికి బస్సు వచ్చిన రెండు, మూడు నిమిషాల్లోనే సీట్లు పూర్తిగా నిండిపోతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం మహిళా ప్రయాణికులే ఉంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం కాకముందు ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో మొత్తం ప్రయాణికుల సంఖ్య సగటున రోజుకు 1.55 లక్షలు ఉండగా.. పథకం అమలయ్యాక 2.90 లక్షలకు పైగా చేరిందని, అందులో 1.70 లక్షలకు పైగా మహిళలే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత 2023 ఏడాది డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు దాదాపుగా 894 రోజులను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పరిధిలో 2172.27 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు ప్రకటించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రూ.752.06 కోట్ల ఆదాయం

ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీ డిపోలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2023 సంవత్సరం డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు ఛార్జీల రూపంలో రూ. 752.06 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 650.21 లక్షల మంది మహిళలు ప్రయాణించడంతో రూ.225.53 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ డిపోల పరిధిలో 631.09 లక్షల మంది ప్రయాణించడంతో రూ.218.20 కోట్లు వచ్చాయి. నారాయణపేట జిల్లా పరిధిలో 301.16 లక్షల మందికి రూ.104.39 కోట్లు, జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 280.84 లక్షల మందికి రూ.96.97 కోట్లు, వనపర్తి జిల్లా పరిధిలో 308.97 లక్షల మంది మహిళల వల్ల రూ.106.98 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రీజియన్ పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. తర్వాత స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది.



అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాలబ్రహ్మేశ్వరాలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి ఆలయంలో రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి, జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

నాట్య మయూరాలు

కూచిపూడిలో రాణిస్తూ.. శిక్షణనిస్తున్న మహిళలు



వెయ్యి మందికి శిక్షణ

జడ్చర్ల పట్టణం, వనపర్తి, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఈ రంగంలో భవిష్యత్తులో రాణించేందుకు శిక్షణ తీసుకుని పట్టు సాధించారు. పలు వేదికలపై ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. అంతటితో ఆగిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నాట్యకారిణులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

మాది వనపర్తి పట్టణం. జడ్చర్లలో ఉంటున్నా. గురువు వద్ద శిక్షణ తీసుకున్నా. కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా, తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ కూచిపూడి కోర్సు పూర్తి చేశా. 80కి పైగా ప్రదర్శనలిచ్చి బహుమతులు పొందా. 'సాయికృప కూచిపూడి కళాక్షేత్రం' ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా. వెయ్యి మంది చిన్నారులను తీర్చిదిద్దాను. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చి ప్రతిభ కనబరుస్తున్నారు. నృత్యంతో పాటు శ్లోకాలు, ముద్రలు, తాళాలు, పాటలు నేర్పిస్తున్నా. నాకు నాట్య మయూరి, నాట్యశ్రీ, నృత్య ప్రతిభ కళారత్న, నాట్యహంస, నాట్య మంజీరా పురస్కారాలు దక్కాయి. సర్కారు పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. **- పడాల బిందుమాధవి**



25 ప్రదర్శనలిచ్చా..

జడ్చర్ల వెంకటేశ్వరకాలనీ మాది. అమ్మానాన్న ఆరేళ్లు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తున్నా. దేవస్థానాలు, వివిధ వేదికల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించా. 25 నృత్య ప్రదర్శనలిచ్చా. అమెరికా, దుబాయ్, ఆస్ట్రేలియాలో చిన్నారులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నా. ఏడాది కిందట 'కృష్ణ తరంగిణి నృత్యాలయం' ఏర్పాటు చేశా. వంద మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నా. వీరు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించా. మయూరి నర్తకి, నంది పురస్కారాలు అందుకున్నా. కూచిపూడి నృత్యంలో మరింత రాణించడమే నా లక్ష్యం. **- చిగుళ్లపల్లి సంధ్య**

తరగతి గది.. విజ్ఞాన నిధి

వినూత్నంగా బోధిస్తున్న ఉపాధ్యాయినులు





పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయినులు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య దేశ భవితను నిర్మిస్తున్నారు. నల్లపలక వంటి మెదడులో విజ్ఞానమనే అక్షరాలు దిద్ది, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల జీవితాల్లో విజ్ఞాన కాంతులు వెదజల్లుతున్నారు. బోధనోపకరణాలతో వినూత్నంగా బోధిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

ఆకర్షించేలా.. అన్వేషించేలా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని **వి.స్వప్న** సులువైన మార్గాలతో విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్నారు. పాఠ్యాంశాలను ఆకర్షించేలా, అన్వేషించేలా, వివరించేలా, విస్తరించేలా, మదింపు చేసేలా.. ఇలా పది సార్వత్రిక టీఎల్‌ఎం బోధనా పద్ధతులను బోధనకు వినియోగిస్తున్నారు. ఆటల ద్వారా, గ్రూప్ యాక్టివిటీ, ప్రశ్నల పెట్టె, రియల్ లైఫ్ లింక్, మల్టీ సెన్సార్, లో కాస్ట్-నో కాస్ట్, డిజిటల్ విధానాల్లో బోధిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకుంటున్నారు.



భయం పోగొట్టి..: బాలానగర్ మండలం పెద్ద రేవల్లి ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయిని **పాలాది శ్రీవాణి** తనదైన శైలిలో బోధిస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఆంగ్లంలో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టి. టీఎల్‌ఎంతో కథలను అనుసంధానించి బోధిస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా బ్రిడ్జింగ్ గ్యాప్ యాక్టివిటీతో విద్యార్థుల్లో లెర్నింగ్ గ్యాప్‌ను తగ్గిస్తున్నారు. బోధనలో ఆమె చొరవ రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా నిలబెట్టాయి. పూర్వ ప్రాథమిక విద్య కరికులం డెవలపర్‌గా తన వంతు పాత్ర పోషిస్తున్నారు.



దృశ్య ప్రధానంగా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) **సి.అరుణమ్మ** విద్యార్థులకు సహజ పద్ధతిలో బోధిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలు బోధించడం కంటే దృశ్య ప్రధానంగా చేసి చూపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠాలకు అనుగుణంగా టీఎల్‌ఎంలను తయారు చేసి విద్యార్థులకు చూపుతూ బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు సైతం అర్థం చేసుకుంటున్నారు. తడబాటు లేకుండా పరీక్షల్లో సమాధానాలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు.

విద్యార్థులే గురువులు.. నాయకులు : కోయిలకొండ మండలం పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ **ఎ.వంశీలత** చిన్నారులకు ఆంగ్లంలో వినూత్నంగా బోధిస్తున్నారు. పనిచేస్తూ నేర్చుకోవడం అనే పద్ధతి ఆధారంగా లిటిల్ టీచర్-లిటిల్ లీడర్ అనే భావనతో విద్యార్థులే చిన్న ఉపాధ్యాయులుగా, చిన్న నాయకులుగా మారి సహచరులకు పాఠ్యాంశాలను వివరించేలా ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రతి విద్యార్థిని అభ్యసన ప్రక్రియలో చురుకైన భాగస్వామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

దాతలు నిర్మించినా.. నిరుపయోగమే



తాళం వేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవి ఉన్నా వినియోగించని దుస్థితి. ఈ బడి పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. కానీ వసతులు మాత్రం మెరుగుపడలేదు. 240 మంది విద్యార్థులు చదువుతున్నా కనీస సౌకర్యాలు లేవు. దీంతో గతేడాది ఓ స్వచ్ఛంద సంస్థ రూ.లక్షలు ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు కుళాయి, తాగునీటి ట్యాంకులు నిర్మించింది. నెలలు అవుతున్నా వాటిని ప్రారంభించడం లేదు. తాళం వేసి ఉంచడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

79 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో ఆదివారం రెండు టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన ఒకటి, దిగువన ఒక టర్బయిన్‌లో 79 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 5075 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమానంతో మహిళ దారుణ హత్య

కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజాపూర్ ఠాణాలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గఢ్ జిల్లా కచికేడికి చెందిన చోటేఖాన్ లారీ డ్రైవర్. మూడేళ్ల కిందట లారీ నడుపుతుండగా.. షాద్‌నగర్‌లో మహిళ పరిచయమైంది. ఆమె రెండేళ్ల కిందట లాలీ(35) అనే మహిళను చోటేఖాన్‌కు పరిచయం చేసింది. వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లితండాకు చెందిన లాలీకి భర్త, ఇద్దరు పిల్లలున్నా బాలానగర్‌లోని అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

పరిచయం ప్రేమగా మారి..: చోటేఖాన్, లాలీ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. లాలీ బాలానగర్‌లో లారీ ఎక్కి చోటేఖాన్‌తో కలిసి బెంగళూరు, నాగ్‌పుర్, తమిళనాడుకు వెళ్లేవారు. అయితే ఆమె వేరే వ్యక్తులతో శారీరక సంబంధం పెట్టుకుందనే అనుమానంతో చోటేఖాన్ పలుమార్లు మందలించాడు. అతడి భార్య కూడా చనిపోవడంతో లాలీని పెళ్లి చేసుకొని, స్వగ్రామంలో ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ విషయం ఆమెకు చెప్పినా చూద్దాంలే అని బదులిచ్చేవారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి.

అంతమొందించాడిలా...: చోటేఖాన్ లారీతో ఈ నెల 15న కేరళ నుంచి హరియాణాకు బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆరు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. 18న బాలానగర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణం దగ్గర లారీ ఆపి, లాలీకి ఫోన్ చేశాడు. హరియాణకు వెళ్తున్నానని, రావాలని కోరగా.. మరో లారీ వద్ద ఉన్నానని, ఐదు నిమిషాలు ఆగాలని ఆమె సమాధానమిచ్చారు. అనుమానం వచ్చి ఆమె ఉన్న చోటకు వెళ్లగా.. వేరే వ్యక్తులతో కనిపించారు. దీంతో ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెను లారీలో ఎక్కించుకున్నాడు. ఎందుకు మోసం చేశావని గొడవ పెట్టుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న చోటేఖాన్ క్షణికావేశంలో కూరగాయల కత్తితో ఆమె గొంతుపై పొడిచాడు. చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో రహదారి పక్కన పడేశాడు. అనంతరం లారీతో బెంగళూరు వైపు పారిపోయాడు. 19న స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అద్దె గదిలో సిమ్‌కార్డు, కాల్ రికార్డు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును 10 రోజుల్లోనే ఛేదించిన జడ్చర్ల గ్రామీణ సీఐ మహేశ్, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

సుమతి ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: సీపీఐ నాయకురాలు సుమతి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సుమతి సంతాప సభలో ఆమె ప్రసంగించారు. సుమతి విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో పనిచేసి, కులాంతర వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. సుమతి భర్త రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, కుమార్తె డా.ప్రతిభ, అల్లుడు డా.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, బాబురావు, వెంకటేశ్వరరావు, సాగర్, జంగారెడ్డి, మురళీకృష్ణ, వెంకట్రాములు, భూపాల్, శివప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య ప్రసాదరావు, శివప్రసాద్, రాంరెడ్డి, గోపాల్, కురుమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

354 మంది అభ్యర్థుల హాజరు



ఫాతిమా విద్యాలయం కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన నీట్ పీజీ అర్హత పరీక్ష -2026 ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయం, ధర్మాపూర్ వద్ద ఉన్న జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష సజావుగా సాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పరీక్షకు 360 మంది అభ్యర్థులకు 354 మంది (99 శాతం) హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 180 మందికి 178 మంది, జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మందికి 176 మంది హాజరయ్యారు. ఆరుగురు మాత్రమే గైర్హాజరయ్యారు. పరీక్షలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన జీపీవోల సేవలను ఆరా తీశారు.

పోలీస్ బందోబస్తు: పరీక్ష కేంద్రాలకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కేంద్రాలను ఎస్పీ డి.జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గ్రామీణ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



వీరస్వామి

వీపనగండ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మరణించాడు. ఆదివారం రాత్రి వీపనగండ్ల-వెలగొండ మధ్య జరిగింది. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన పంచాయతీ వర్కరు వీరస్వామి(38) చిన్నంబావి మండలం దగడపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి వెలగొండ సమీపంలో ఓ చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వీరస్వామి గుర్తించి దారిన వెళ్లే వారు 108కు సమాచారమిచ్చారు. క్షతగాత్రుడ్ని వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈయనకు భార్య జ్యోత్స్న, కుమార్తె ఉన్నారు.

సాంకేతికత తోడుగా.. భద్రత మెండుగా

ఏటీఆర్ సంరక్షణకు డ్రోన్ల వినియోగం



అడవిలో చెట్లకు కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

అమ్రాబాద్, న్యూస్‌టుడే: అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం(ఏటీఆర్) పరిరక్షణ ఆధునిక సాంకేతికత వినియోగంతో మరింత పటిష్ఠంగా మారింది. వన్యప్రాణులు, అరుదైన వృక్ష జాతులు, విలువైన కలపకు నిలయమైన నల్లమల పరిరక్షణకు వాచర్లు, ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్ఆర్వోలు నడుం బిగించారు. ప్రతి ప్రాంతాన్ని సిబ్బంది నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించడం సాధ్యం కాకపోవటంతో కీలకమైన సాంకేతికతను ఆసరాగా చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి అక్రమాలకు పాల్పడుతున్న వేటగాళ్లు, స్మగ్లర్లు, ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు కెమెరాలు, డ్రోన్లు, ఈ-సర్వైలెన్స్ కెమెరాలు వినియోగిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

వన్యప్రాణులు, వేటగాళ్ల కదలికలపై నిఘా: అడవి 2,611 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. అడవిలో జంతువులు తరచూ సంచరించే ప్రదేశాలు, మార్గాలు, నీటి వనరుల వద్ద, పులులు వన్యప్రాణులను చంపిన ప్రదేశాల్లో సిబ్బంది కెమెరాలను చెట్లపై నేలకు అడుగున్నర ఎత్తులో బిగిస్తారు. పులులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులు కెమెరాల ఎదుట నుంచి వెళ్లినపుడు వాటి కదలికలను పసిగట్టి చిత్రాలను రికార్డు చేస్తాయి. దీంతో అడవిలోని వన్యప్రాణుల సంచారంపై సమాచారం తెలుస్తుంది. అడవిలోకి అక్రమంగా ప్రవేశించే వేటగాళ్లు, స్మగ్లర్లు, అటవీ ఆక్రమణదారుల చిత్రాలు కెమెరాల్లో రికార్డవుతాయి. గతంలో మద్దిమడుగు రేంజ్, అచ్చంపేట రేంజ్‌లలో వేటగాళ్లు జంతువులను వేటాడి మాంసాన్ని తీసుకెళ్తూ కెమెరాలకు చిక్కారు. వీటి ఆధారంగా నిందితులను గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. కెమెరాలో నిక్షిప్తమైన చిత్రాలను డేటాబేస్‌లో నిల్వ చేస్తారు.

డ్రోన్లతో పరిశీలన

ఏటీఆర్‌లో మనుషులు చేరుకోలేని లోయలు, ఎత్తైన కొండ ప్రాంతాలను పరిశీలించేందుకు రెండు అధునాతన డ్రోన్లను వినియోగిస్తున్నారు. అటవీ ఆక్రమణలు, కలప నరికివేత, మానవ సంచారం, అగ్నిప్రమాదాల సమాచారాన్ని తెలుసుకునేందుకు డ్రోన్లు సహాయపడుతున్నాయి. వీటితో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణాన్ని పరిశీలించే అవకాశం ఉంటుంది. వేసవిలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాల్లో మంటల వ్యాప్తి నిరోధానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక డ్రోన్లు 10 కి.మీ. విస్తీర్ణంలోనూ చిత్రాలను చిత్రీకరిస్తాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్ : 8008333816 భూత్పూర్ : 8686783574
బాలానగర్ : 9705983863 దేవరకద్ర : 9000031648
జడ్చర్ల : 8008573899, 8008573901

? మెట్టుగడ్డలోని ప్రేమ్‌నగర్‌లో శ్రీఆంజనేయస్వామి ఆలయ సమీపంలో నీరు లీకేజీ అవుతోంది. - **విజయభాస్కర్, ప్రైవేటు ఉద్యోగి** ✔ మరమ్మతులు చేపడతాం. - **గోపాల్, కార్పొరేషన్ ఏఈ** ? ఏనుగొండ వివేకానంద నగర్‌లో ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. - **రామచంద్రయ్య, స్థానికుడు** ✔ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **వజ్రకుమార్‌రెడ్డి, శానిటరీ అధికారి** ? బ్రాహ్మణవాడ శ్రీఆంజనేయస్వామి ఆలయ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింది - **వెంకటేశ్, స్థానికుడు** ✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - **నుస్రత్, కార్పొరేషన్ ఏఈ** ? దేవరకద్ర మండలం డోకూర్ ఎస్సీకాలనీలో సీసీ రహదారులు నిర్మించాలి. - **నాగరాజు** ✔ సీసీ రహదారి నిర్మిస్తాం. - **శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, దేవరకద్ర** ? కోయిలకొండ మండలం మోదీపూర్ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయాలి. - **రాజు** ✔ పరిశీలించి పనులు పూర్తి చేస్తాం. - **మిథిమ్, ఏఈ**

– న్యూస్‌టుడే, మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), దేవరకద్ర, కోయిలకొండ

తెరపై ఈనాడు

మహబూబ్‌నగర్‌లో.. శ్రీనివాస - **టాక్సిక్**, బాలాజీ - **టాక్సిక్**, తిరుమల - **ఇరుముడి**, వెంకటేశ్వర-**విశ్వనాథ్ అండ్ సన్స్**, మైత్రి శ్రీకృష్ణ స్క్రీన్-1 - **ఇరుముడి**, స్క్రీన్-2 - **ఇరుముడి**
దేవరకద్రలో.. రాఘవేంద్ర - **టాక్సిక్**
– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నగరం, దేవరకద్ర

కేంద్ర మంత్రికి స్వాగతం



కిషన్‌రెడ్డితో భాజపా కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి

భూత్పూర్, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ - గద్వాల రెండో రైల్వేలైన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వెళ్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భూత్పూర్‌లో స్వాగతం పలికారు. ఆదివారం అలంపూర్‌కు వెళ్తున్న ఆయన భూత్పూర్‌లో ఆగారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్‌రెడ్డి నివాసంలో తేనీరు స్వీకరించారు. కార్యకర్తలతో మాట్లాడారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



మహమ్మదాబాద్: కార్యకర్తలతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్, మహమ్మదాబాద్: గ్రామాల్లో సంక్షేమ పథకాలపై కార్యకర్తలు అవగాహన కల్పించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మదాబాద్, గండీడ్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్‌ఐఆర్‌లో తప్పిదాలను సరిచేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు నారాయణ, అనంత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

హన్వాడ, న్యూస్‌టుడే: తెలంగాణ పీఆర్టీయూ నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడిగా స్వామి, ప్రధాన కార్యదర్శిగా విజయానంద్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావ్, నరసింహారెడ్డి, శైలజ, నాగమణి, సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జున్, స్వప్న, నజియాబేగం, వెంకటేశ్, రవి, మంజుల, రాజేశ్వరి ఎన్నికయ్యారు. జిల్లా, రాష్ట్ర కమిటీ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ కార్యవర్గం



సత్యనారాయణ | రాజశేఖర్‌రెడ్డి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సభ్యులు నారాయణగౌడ్, జనార్దన్, బుచ్చారెడ్డి, చంద్రశేఖర్, శివకుమార్, తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, పాండురంగాచారి పాల్గొన్నారు. నూతన కమిటీ బాధ్యులను వారు సన్మానించారు.

యువకుల రక్తదానం



భూత్పూర్, న్యూస్‌టుడే: మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని భూత్పూర్‌లో ముస్లిం యువకులు ఆదివారం రక్తదానం చేశారు. మసీద్ కమిటీ, రహెమత్ నౌ జవాన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని మతపెద్ద ఫయాజుద్దీన్ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సంస్థ 40 మంది రక్త యూనిట్లను సేకరించింది. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, కార్యదర్శి అహ్మద్, జమీర్, అఫ్సర్, మాజీ కౌన్సిలర్ సభ్యులు ఖదీర్, యాసిన్, ఖాసీం, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్‌కో మర్రి.. నిర్లక్ష్య దరి

శిథిలావస్థకు చేరిన రైల్వే వంతెన



వంతెనపై పెరిగిన మొక్కలు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా అంటేనే గుర్తుకొచ్చేది పిల్లలమర్రి. అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా ఈ మొక్కలు పెరుగుతన్నాయి. మహబూబ్‌నగర్‌లోని కలెక్టర్ బంగ్లా పక్కనున్న రైల్వే వంతెన పిల్లర్‌కో మర్రి మొక్క మొలవడంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంటోంది.



బ్రిడ్జిపై అధ్వానంగా ఫుట్‌పాత్

స్తంభాలు విరిగిపోయాయి..: నగరంలోని టీడీగుట్ట ప్రాంతంలో ట్రాఫిక్ అధికమవుతున్న నేపథ్యంలో 1995లో కేంద్ర ప్రభుత్వం వంతెనను మంజూరు చేసింది. 2003లో ప్రారంభించారు. వాహనాల రాకపోకలతో అనతికాలంలోనే బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో 2022లో రూ.9.80లక్షలతో మరమ్మతులు చేశారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం బ్రిడ్జికి పగుళ్లు వచ్చాయి. ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. స్తంభాలూ విరిగిపోయాయి. దీంతో రాత్రి పూట చిమ్మచీకటిగా ఉంటోంది.

నిత్యం వాహనాల రద్దీతో..: నిత్యం అనేక వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా నుంచి మార్కెట్‌కు వెళ్తాయి. బోయపల్లి గేటు వద్ద రైల్వే గేటు పడినప్పుడు ఇక్కడి నుంచే వెళుతుంటారు. హనుమాన్‌నగర్, కొత్తచెరువు, మడుగు నగర్, సింహగిరి, న్యూ గంజ్, మోతీనగర్, వానగుట్ట, ఫైర్ స్టేషన్, టీడీగుట్ట, ఖలీల్ చౌక్, కోయిలకొండ కూడలి, చిన్నదార్‌పల్లి తదితర ఆరు కార్పొరేట్ డివిజన్లకు ఈ బ్రిడ్జి ప్రధాన రహదారి.

తిరుగు పయనం.. ట్రాఫిక్ జాం



రాఖీ పండగకు సొంతూర్లకు వెళ్లిన వారు తిరుగు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో 44వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. బాలానగర్ వంతెనకు ఇరువైపులా 4 కిలోమీటర్ల మేర వాహనాలు బారులుదీరాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం

నీటి రాక.. చేపల వేట



కోయిలసాగర్ జలాశయానికి జూరాల నీరు చేరుతుండటంతో మత్స్యకారులు చేపల వేట మొదలుపెట్టారు. ఆదివారం కాల్వ, జలాశయంలో వలలు వేస్తున్న దృశ్యాలను అక్కడికొచ్చిన పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ప్రాజెక్టు పరిసరాలు సందడిగా మారాయి. చేపల వేటతో ఉపాధి లభిస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, దేవరకద్ర

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో నగర మేయర్ జి.మమత, స్థానిక కార్పొరేటర్ పెద్దగొల్ల నర్సిములు



ఆంజనేయస్వామి మూలవిరాట్టు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ పరిధిలో శ్రీరామకాలనీలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. హోమం, సామూహిక పూజలు అనంతరం వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత కాశీ విశాలాక్షి, శివలింగం, ఆంజనేయస్వామి, ధ్వజస్తంభం, నవగ్రహాలు, నాగేంద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శిఖర కలశ పూజ విశేషంగా జరిగింది. నగర మేయర్ జి.మమత, డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పెద్దగొల్ల నర్సిములు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సిములు, మాజీ కౌన్సిలర్ వెంకటయ్య, మైత్రియాదయ్య, సిద్ధు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు



లబ్ధిదారు ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్ మండలం మోతిగణపూర్‌లో ఇందిరమ్మ గృహ ప్రవేశం, తిరుమలగిరిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. నందారం, ఏడుగుట్టతండాలో బాధితకుటుంబాలను పరామర్శించారు. శంకర్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌నాయక్‌ఉన్నారు.

పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలపై ఉత్కంఠ

నేడు ఎస్పీ కార్యాలయంలో పోలింగ్

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అధికారుల సంఘం జిల్లా ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. గత సోమవారం ఆయా పోలీస్ స్టేషన్లలో సర్కిల్స్, విభాగాల వారీగా ఎన్నికలు జరిగాయి. అందులో జిల్లా వ్యాప్తంగా 29 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు. వారంతా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం తరువాత ఓట్లను లెక్కిస్తారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు.

ఇప్పటికే కొన్ని ఏకగ్రీవం..: ఇప్పటికే కొన్ని పోస్టులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం. అందులో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేశ్ (ఎస్‌బీ), ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్ (ఆర్‌ఐ), వెంకటేశ్ (హన్వాడ ఎస్సై), కార్యదర్శిగా అప్పయ్య (వన్ టౌన్ సీఐ), సంయుక్త కార్యదర్శిగా పవన్‌కుమార్ గౌడ్ (ఎంనగర్ రూరల్ కానిస్టేబుల్), సమన్వయ కార్యదర్శిగా యాదగిరయ్య గౌడ్ (ఏఆర్ఎస్సై), కోశాధికారిగా శేఖర్ (రెండో పట్టణ ఠాణా హెచ్‌సీ), ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా రెండో పట్టణ ఠాణా పీసీ పద్మ ఎన్నికయ్యారు.

ఒక్కో సభ్యుడికి ఓట్లు ఇలా..: ఈ ఎన్నికల్లో ఒక్కో సభ్యుడు ఐదు ఓట్లను వినియోగించనున్నారు. జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ పదిమంది ఎవరి మాట వినకుండా ఎన్నికల బరిలో నిలిచారు. దీంతో ప్రతినిధుల ఓట్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు యత్నాలు ఆరంభించారు. తమ సామాజిక వర్గాలతో పాటు, బ్యాచ్‌ల వారీగా తమకే మద్దతు తెలపాలని కోరుతుండటంతో ఈ ఎన్నికలు ఉత్కంఠను రేపుతున్నాయి.

ఐదు పోస్టులకు పది మంది బరిలో..: జిల్లా పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గంలో మూడు ఎగ్జిక్యూటివ్ సివిల్ పోస్టులకు ఆరుగురు పోటీ పడుతున్నారు. అందులో రవికుమార్ (హెచ్‌సీ కోయిలకొండ), సురేశ్ (మహిళా ఠాణా పీసీ), రఘు (భూత్పూర్ పీసీ), రాజేశ్వర్ రెడ్డి (పీసీఆర్ పీసీ), నర్సింహులు (వన్‌టౌన్ పీసీ), శ్రీనివాస్ గౌడ్ (ట్రాఫిక్ పీసీ) బరిలో నిలిచారు. రెండు ఏఆర్ పోస్టులకు మారుతి విద్యాసాగర్ (ఏఆర్ పీసీ), యాదయ్య (ఏఆర్‌హెచ్‌సీ), బీమ్లానాయక్ (ఏఆర్‌పీసీ), సురేశ్ (ఏఆర్‌పీసీ) తదితరులు పోటీలో ఉన్నారు. జిల్లా కార్యవర్గంలో ఎన్నికైన వారు మూడేళ్ల పాటు అధికారంలో ఉంటారు. వారే జిల్లాలో పని చేస్తున్న 800 మంది పోలీసు అధికారులకు, సిబ్బందికి వారధిలాగా పని చేస్తారు. సిబ్బంది సమస్యలను పోలీస్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి తమ వంతు సేవలను అందిస్తారు.

నిర్మించారు.. వృథాగా వదిలేశారు



నవాబ్‌పేట మండలం కూచూరు గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డు ఉన్నా వినియోగించని దుస్థితి. రూ.లక్షలు ఖర్చు చేసి, వృథాగా వదిలేయడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఇప్పటికైనా షెడ్డుకు చెత్త తరలించి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నవాబ్‌పేట

ప్రారంభించి.. విస్మరించి..

బాలానగర్ మండలం ఉడిత్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గుత్తేదారుడు పిల్లర్లు వేసి వదిలేశారు. ప్రస్తుతం ఇక్కడ పిచ్చిమొక్కలు పెరిగాయి. కొద్దిపాటి నిర్మాణం శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం



బోనాల ఉత్సవాలు



జడ్చర్ల: ఊరేగింపులో భక్తులు

జడ్చర్ల పట్టణం, రాజాపూర్, న్యూస్‌టుడే: జడ్చర్ల కావేరమ్మపేట రహదారి పక్కనున్న బంగారు మైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచి బుక్కా వెంకటేశం, అనిల్‌రెడ్డి, వంశీ, మాలిక్‌షాకీర్, రమేష్, చంద్రమౌళి, చైతన్యచౌహాన్, ప్రశాంత్‌రెడ్డి, కుమ్మరిరాజు, మహేష్, పిట్టల మురళి, భాస్కర్‌రెడ్డి, కరాటే శ్రీను, శ్రీకాంత్ ఉన్నారు.

● రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో ఆదివారం కోటమైసమ్మ బోనాల పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



మ.నగర్ రాఘవేంద్రస్వామి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం పరిమళగిరిలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు రెండోరోజు ఆదివారం కనులపండువగా కొనసాగాయి. అర్చకుడు భూత్పూర్ రామారావు పూజలు చేశారు. సోమవారం రథోత్సవం ఉంటుందని ఆలయ మేనేజర్ రవీందర్‌రావు తెలిపారు. శ్రీరాఘవేంద్ర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్లలోని రాఘవేంద్రస్వామి మఠంలో ఆరాధన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సుప్రభాత సేవ, అష్టోత్తర పారాయణం, పంచామృతాభిషేకం నిర్వహించారు.




రంగారెడ్డిగూడలో..

మైసమ్మకు ప్రత్యేక పూజలు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని కాకర్లపహాడ్ సమీపంలో ఉన్న పర్వతాపురం మైసమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. నూతన వాహనాలకు పూజలు చేశారు.

రాని నిధులు.. నిలిచిన పనులు

రెండేళ్లుగా కంకర రహదారులపైనే ప్రయాణం



మసిగుండ్లపల్లి – ఈదులబావి తండా రోడ్డు దుస్థితి

న్యూస్‌టుడే పరిశీలన

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: రాళ్లు తేలి, గుంతలు పడిన రహదారులపై ఏళ్లుగా రాకపోకలు సాగించారు. ఈ కష్టాలు ఇంకెన్నాళ్లు అనుకుంటున్న తరుణంలో ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు బాగుపడి ఇక నుంచి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని సంబరపడ్డారు. రోజులు గడిచిపోతున్నా పనులు ముందుకు సాగకపోవడంతో మురిపెం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. మిడ్జిల్ మండలంలో నెలకొన్న ఈ పరిస్థితిపై కథనం.

కారణం ఇలా..: ఆరంభంలో పనులు చురుకుగా చేపట్టి మధ్యలోనే వదిలేశారు. నిధుల విడుదలలో జాప్యం నెలకొనడంతో గుత్తేదారుడు నిలిపివేశారనే చర్చ జరుగుతోంది. ఇటీవల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తారురోడ్డు నిర్మాణాలకు సంబంధించి రూ.45 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. మరి ఎప్పుడు చర్యలు తీసుకుంటారో, రహదారులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో చూడాలి.

ఇదీ పరిస్థితి..: మిడ్జిల్ మండలం మసిగుండ్లపల్లి నుంచి ఈదులబావి తండా వరకు 2.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.1.64 కోట్లు, చౌటకుంటతండా నుంచి తుల్జానాయక్‌తండా వరకు 2.5 కి.మీ. నిర్మాణానికి రూ.1.64 కోట్ల నిధులు గిరిజన సంక్షేమ శాఖ మంజూరయ్యాయి. నాడు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గుత్తేదారుడు కంకర పరిచి వదిలేశారు. దీంతో గతంలో కన్నా అధ్వానంగా మారింది రోడ్డు. వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు.

అంబులెన్స్‌లు రావడంలేదు..



నిత్యం కంకరపై రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు మొరాయిస్తున్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్, ప్రైవేటు వాహనాలు తండాలకు రావడం లేదు. ఇప్పటికైనా మా కష్టాలు తీర్చాలి.
– హీర్యానాయక్, ఈదులబావితండా

పట్టింపు కరవు..



రెండేళ్లుగా కంకరపై ప్రయాణం సాగిస్తున్నాం. పలుమార్లు ప్రభుత్వం, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గిరిజనుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదు. ఇప్పటికైనా స్పందించి వెంటనే పనులు చేపట్టాలి. – శ్రీనివాస్‌నాయక్, తుల్జానాయక్‌తండా

ఉన్నతాధికారుల దృష్టికి..: సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే గుత్తేదారు పనులు చేపట్టలేమని చెబుతున్నారు. ఎన్నిసార్లు సూచించినా ఫలితం ఉండటంలేదు. నిధుల విడుదల, నిలిచిన పనుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – రఘు, ఏఈ

పాత ఫోన్ల కొనుగోలు పేరుతో అనుమానితుల సంచారం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పాత ఫోన్లు కొనుగోలు చేస్తామంటూ తిరిగే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని రంగాపురం గ్రామ వాట్సప్ గ్రూపులో యువకులు సందేశాలు పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని కొందరు గ్రామస్థులు ప్రశ్నించగా పొరపాటున వచ్చానని ఇకపై మీ గ్రామానికి రానని చెప్పడంతో వదిలేశారు. కొందరు అనుమానాస్పద వ్యక్తులు పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళ చోరీలకు పాల్పడుతుంటారని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సందేశం పెట్టారు.

దిల్లీకి తరలిన సీపీఐ నేతలు

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: దిల్లీలోని రాంలీలా మైదానంలో సెప్టెంబర్ 1న నిర్వహించే సీపీఐ బహిరంగ సభకు జిల్లా నేతలు తరలివెళ్లారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ.. భాజపా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణ యాదవ్, సత్యనారాయణరెడ్డి, చాంద్‌పాషా, భార్గవి, ఆసిఫ్ రహమాన్, పద్మావతి పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్‌కు ఐదు ఎకరాలు

దేవరకద్ర, న్యూస్‌టుడే: దేవరకద్ర పుర పరిధిలో రైల్వే డబ్లింగ్ పనులకు 5 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయిస్తున్నట్లు ఆర్‌ఐ శరత్ తెలిపారు. ఆదివారం రైతులతో కలిసి భూములను పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ భూమితో పాటు 1,500 గజాల ప్లాట్లను కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికే లబ్ధిదారులకు నోటీసులు అందించామన్నారు. త్వరలో పరిహారం ఇస్తామన్నారు. కార్యక్రమంలో జీపీవో రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతితో క్రీడాకారులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సుబ్రతో ఫుట్‌బాల్ పోటీల్లో జడ్చర్ల ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల జట్టు ప్రతిభ కనబర్చింది. ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్, అధ్యాపకులు రామకృష్ణగౌడ్, రఘురాం, శిక్షకులు కల్యాణ్, స్వప్న తదితరులు క్రీడాకారులను అభినందించారు.

యజ్ఞంతో పర్యావరణ పరిరక్షణ



ప్రసంగిస్తున్న తెలుగు రాష్ట్రాల ఆర్య ప్రతినిధుల సభాధ్యక్షుడు విఠల్‌రావుఆర్య

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: యజ్ఞంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలుగు రాష్ట్రాల ఆర్య ప్రతినిధుల సభాధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య పేర్కొన్నారు. నగరంలోని బ్రాహ్మణవాడలో ఆర్యసమాజ్ మందిర్‌లో మూడ్రోజుల పాటు చేపట్టిన శ్రావణ వేద సప్తాహ పూజలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో విఠల్‌రావు ఆర్య పాల్గొని మాట్లాడారు. నగర మేయర్ జి.మమత, స్థానిక కార్పొరేటర్ రమేశ్‌కుమార్, ఆర్యసమాజ్ జిల్లా అధ్యక్షుడు డా.భరద్వాజ్ నారాయణరావు, ఆచార్య హరికిషన్‌జీ, కపిల్‌దేవ్‌శర్మ, భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, దయానంద విద్యామందిర్ ప్రధానాచార్యులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: మహమ్మదాబాద్ మండలం మంగంపేట్‌తండాకు చెందిన అంజ్యా నాయక్ ఇటీవల మృతి చెందారు. గ్రామస్థులు రూ.52,000 సేకరించి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గీతాపాండు, బాల్య, గోబ్రియా, గోపాల్, పాండు, బొప్యా, బాజ్యశంకర్ పాల్గొన్నారు.

జడ్చర్ల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలానగర్ మండలం చింతకుంటతండాకు చెందిన పట్నీ(42) ఆదివారం మృతి చెందారు. సంఘ సేవకుడు భాస్కర్‌నాయక్ రూ.10వేలు అందించారు. రమేశ్‌నాయక్, నాగేందర్‌నాయక్, గోపాల్‌నాయక్, సూర్యనాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మిడ్జిల్ మండలం రాణిపేట శివారులో 167వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం దోనూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడటంతో అతడికి గాయాలయ్యాయి. 108 వాహన సిబ్బంది గౌస్, శివ ప్రథమ చికిత్స చేసి, నగరంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్సై కర్నె శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి వస్తోంది. వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి పద్మావతికాలనీ వద్ద బస్సును అడ్డగించి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. బస్సు తనను ఢీకొట్టేదని, చూసి నడపవా అంటూ టికెట్ మిషన్‌తో డ్రైవర్ తలపై కొట్టాడు. గాయపడిన డ్రైవర్ గ్రామీణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసు

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం జూలపల్లికి చెందిన చిన్న నర్సిములుపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ నెల 27న దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోయిలకొండ, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కోయిలకొండ మండలం ఆచార్యపూర్‌కు చెందిన పోతన్‌పల్లి గోవిందు ఆదివారం తెల్లవారుజాము అంకిళ్ల వాగు వైపు నుంచి తరలిస్తున్నట్లు చెప్పారు. పల్లుతండాలో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.